క్లుప్తంగా

నియోజకవర్గంలో 2.15 లక్షల ఓటర్లు

సామర్లకోట: పెద్దాపురం నియోజకవర్గంలో ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో 2,15,095 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారని పెద్దాపురం ఎన్నికల రిటర్నింగ్ అధికారి జె.సీతారామారావు తెలిపారు. ఇందులో పురుషులు 1,05,788, స్త్రీలు 1,09,294, ఇతరులు 13 మంది ఉన్నారన్నారు. పెద్దాపురం రూరల్ పరిధిలో 60,051 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 30,130, స్త్రీలు 29,919, ఇతరులు ఇద్దరు ఉన్నారన్నారు. పెద్దాపురం పట్టణ పరిధిలో 41,277 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 19,734, స్త్రీలు 21,537, ఇతరులు ఆరుగురు, సామర్లకోట రూరల్‌లో 70,161 ఓటర్లు ఉండగా, పురుషులు 34,826, స్త్రీలు 35,332, ఇతరులు ముగ్గురు, సామర్లకోట పట్టణ పరిధిలో 43,606 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 21,098, స్త్రీలు 22,506, ఇతరులు ఇద్దరు ఉన్నారని వివరించారు.

ఉపాధి పనుల పరిశీలన



మూలపేటలో ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకట నారాయణ

కొత్తపల్లి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను కూలీలు సద్వినియోగం చుసుకొవాలని ఎంపీడీఓ వెంకట నారాయణ సూచించారు. మండలంలోని మూలపేట, అమరవిల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పనులు నిర్వహించే చోట నీడనిచ్చేలా టెంట్లు ఏర్పాటు చేయాలని, తాగునీరు, మెడికల్ కిట్‌లు అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పని అడిగిన ప్రతిఒక్కరికీ ఉపాధి హామీ పథకంలో పని కల్పిస్తున్నట్టు తెలిపారు. కూలీల రోజువారీ వేతనాన్ని ప్రభుత్వం రూ.300లకు పెంచిందన్నారు. పలువురు ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

రూ.2.03 లక్షల స్వాధీనం

సామర్లకోట: ఇద్దరి నుంచి రూ.2.03 లక్షలను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం స్వాధీనం చేసుకుంది. దీనిని పెద్దాపురం ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పజెప్పారు. సామర్లకోట నుంచి మోటారు సైకిల్‌పై చంద్రంపాలెం వెళ్తున్న మండపాక సూరిబాబును స్థానిక మెహర్ కాంప్లెక్స్ వద్ద తనిఖీ చేయగా, అతని వద్ద రూ.1.30 లక్షల నగదు లభించింది. ఆ నగదుకు ఎటువంటి అనుమతి లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా వేట్లపాలెం నుంచి మోటారు సైకిల్‌పై మెహర్ కాంప్లెక్స్‌కు వస్తున్న గోలి వీరభద్రప్రసాద్‌ను తనిఖీ చేయగా అతని వద్ద రూ.73 వేలు లభించింది. ఈ మొత్తాన్ని అధికారులు స్థానిక పోలీసుల సమక్షంలో లెక్కించి పెద్దాపురం తరలించారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

కొత్తపల్లి: ప్రస్తుత వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకున్నట్టు ఆర్‌డబ్ల్యూఎస్ జెఈ సంధ్య తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఆమె పర్యటించారు. తాగునీటి సరఫరాపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇస్తున్నట్టు తెలిపారు. గ్రామాల్లోని శివారు ప్రాంతాలకు తాగునీరు సమస్య ఏర్పడుతోందని, సమస్య పరిష్కారానికి వాటర్ ట్యాంకులను నిర్మిస్తామన్నారు. ముఖ్యంగా పంచాయతీ కుళాయిలకు మోటార్లను బిగించడం వలన తాగునీటి సమస్య తలెత్తుతోందన్నారు. దీనిపై పంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు.

భవిష్యత్తు తరాలకు భరోసా జగన్



వాకతిప్పలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొత్తపల్లి: సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భవిష్యత్తు తరాలకు భరోసా కల్పిస్తున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు అన్నారు. మండలంలోని కుతుకుడుమిల్లిలో శుక్రవారం పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీతకు మద్దతుగా ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. పార్టీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, కుతుకుడుమిల్లి, వాకతిప్ప సర్పంచులు కరి చిన్నారావు, దొరబాబు పాల్గొన్నారు.

విజిలెన్స్ దాడులు

శంఖవరం: కత్తిపూడిలోని పలు దుకాణాల్లో శుక్రవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ, సివిల్ సప్లై అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఐదు దుకాణాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 22 డొమెస్టిక్ (గృహ) గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా విజిలెన్స్ డీఎస్పీ ముత్యాలనాయుడు మాట్లాడుతూ గృహ సిలిండర్ల వినియోగంలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విజిలెన్స్ అధికారి జగన్నాథరెడ్డి, లక్ష్మీనారాయణ, సీఎస్‌డీటీ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

పేదల హరిఇల్లు

- స్వర్గసీమను తలపించేలా సౌకర్యాలు
- జగనన్న కాలనీల్లో సుందరంగా గృహాలు
- నియోజకవర్గంలో 16,639 మందికి ఇళ్ల పట్టాలు

సామర్లకోట: గడచిన కొద్ది సంవత్సరాలుగా కొత్త ఊళ్లు పురుడు పోసుకున్నాయి.. జగనన్న కాలనీలతో పేదల ఇళ్లు సర్వాంగ సుందరంగా తయారయ్యాయి.. పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో 16,639 మందికి ప్రభుత్వం గతంలో ఇళ్ల పట్టాలను మంజూరు చేసింది. సామర్లకోట పట్టణంలో 5,347, మండలంలో 4,777 మందికి ఇళ్ల స్థలాలు అందించింది. ఆయా లేఅవుట్లలో రూ.34,01,63,678తో మౌలిక వసతులు కల్పించింది. సామర్లకోటలోని ఈటీసీ లేఅవుట్ సుమారు 52 ఎకరాల్లో 2,412 మందికి మొదటి విడతలో ఇళ్ల నిర్మాణానికి అధికారులు మంజూరు చేశారు. ఇందులో 1,024 ఇళ్లను పూర్తి చేశారు. గృహ నిర్మాణదారులకు రూ.1.80 లక్షల ఆర్థిక సాయంతో పాటు సిమెంట్, ఐరన్ రాయితీపై అందించారు. ఈటీసీ లేఅవుట్‌లోని జగనన్న కాలనీలో ఏడు పార్కులు నిర్మించారు. అలాగే ఓపెన్ జిమ్ ఏర్పాటైంది. ఆ కాలనీ వాసులకు విద్యుత్తు సమస్య లేకుండా ప్రత్యేకంగా రూ. నాలుగు కోట్లతో సబ్ స్టేషన్ నిర్మించారు. సామర్లకోట మండలం అచ్చంపేట, పి.వేమవరం, నవర, చంద్రపాలెం, గొంచాల, పనసపాడు, ఉండూరు, వేట్లపాలెం గ్రామాల్లోని లబ్ధిదారులకు సుమారు 55 ఎకరాల్లో 1,802 స్థలాలు మంజూరు చేశారు. రెండో విడతలో అక్కడ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉంది. అదే పూర్తయితే మరో కొత్త ఊరు తయారవుతోంది.

శరవేగంగా ఇళ్ల నిర్మాణాలు

వేట్లపాలెంలో 408 మందికి, జి.మేడపాడులో 384 మంది, పీబీ దేవంలో 130 మంది, పవరలో 232 మంది, జి.కొత్తూరులో 40 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. ఇందులో 60 శాతం ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. పీబీ దేవం, జి.కొత్తూరు రెండో విడతలో ఉన్నాయి. సామర్లకోట ఉప్పువారి సత్రం, రాజీవ్ గృహకల్ప, అచ్చంపేట శివారు బ్రహ్మానందపురం లేఅవుట్‌లో, ఉండూరు, వీకే రాయపురం, మాధవపట్నం గ్రామాల్లోని లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయగా, రెండో విడతలో నిర్మాణాలు చేపడతారు. ఎన్నికల అనంతరం ఈ నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నారు. చంద్రబాబు హయాంలో పేదలకు ఒక సెంటు భూమి కూడా ఇవ్వలేదని లబ్ధిదారులు అంటున్నారు. ఈ ప్రభుత్వంలో మేలు జరిగిందని చెబుతున్నారు.



సామర్లకోట జగనన్న కాలనీలో ఇళ్ల సముదాయం



సామర్లకోట జగనన్న కాలనీలో చిల్డ్రన్ పార్కు



పవర గ్రామంలో జగనన్న కాలనీ

సొంతింటి కల నెరవేరింది



ఎన్నో ఏళ్లు ఇంటి స్థలం కోసం ఎదురు చూశాం. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఇంటి స్థలం ఇవ్వడమే కాకుండా, ఇల్లు నిర్మించుకోవడానికి గృహ నిర్మాణానికి సాయం అందించడంతో సొంతింటి కల నెరవేరింది. దీనివల్ల అద్దె ఇంటి బాధలు తప్పాయి.

– అలిపాటి బేబీ, పవర, సామర్లకోట మండలం

మా ఇల్లే దేవాలయం



నా భర్త దుర్గబాబు దుస్తుల వ్యాపారం చేస్తాడు. వీర్రాఘవపురంలో అద్దెంట్లో ఉండేవాళ్లం. జగనన్న కాలనీలో స్థలం రావడంతో ఇంటిని సుందరంగా నిర్మించుకున్నాం. ఈ ఇల్లు మాకు ఒక దేవాలయం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని రకాలుగా లబ్ధి పొందాం. జగనన్న మేలు ఎప్పటికీ మరిచిపోలేం.

– కట్టా పద్మావతి, లబ్ధిదారు, సామర్లకోట

పోలింగ్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

పిఠాపురం: పోలింగ్‌లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఓటర్లు పోలింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్లు తీసుకురాకుండా జాగ్రత్త వహించాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి జె.నివాస్ సూచించారు. స్థానిక బాదం మాధవరావు బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఎన్నికల సిబ్బంది శిక్షణా తరగతులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ రోజున సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రతలను వివరించారు. ఈవీఎం, వీవీప్యాట్స్ వినియోగం, పీఓ డైరీ, మాక్‌పోల్, వివిధ రకాల కవర్ల వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకుని పోలింగ్ సిబ్బంది ఆత్మ విశ్వాసంతో ధైర్యంగా పోలింగ్ విధులు నిర్వహించాలని ఆయన సూచించారు. ఆయన వెంట జేసీ, పిఠాపురం ఎన్నికల అధికారి రామ్‌సుందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

మరిడమ్మకు ప్రత్యేక పూజలు



పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పంచామృతాభిషేకాలు చేశారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, చండీ హోమం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వానికి పట్టం కట్టండి



పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు సునీల్, వంగా గీత



నాగులాపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ అభ్యర్థి సునీల్

- వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు చలమలశెట్టి సునీల్, వంగా గీత
- నాగులాపల్లిలో ఎన్నికల ప్రచారం

కొత్తపల్లి: వచ్చే ఎన్నికల్లో సంక్షేమ ప్రభుత్వానికి పట్టం కట్టాలని వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు చలమలశెట్టి సునీల్, వంగా గీత పిలుపునిచ్చారు. మండలంలోని నాగులాపల్లిలో శుక్రవారం రాత్రి వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాజీ ఎంపీపీ అబ్బిరెడ్డి భావన్నారాయణరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ చెందిన 50 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి సునీల్, వంగా గీత కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వంగా గీత మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. సునీల్ మాట్లాడుతూ మేకప్ మ్యాన్‌లను నమ్మవద్దని, స్థానికంగా ఉండి సేవ చేసేవారిని ఎన్నుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, ఎంపీటీసీ అనిశెట్టి సుభాషిణి, పార్టీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అడ్వైజరీ కమిటీ చైర్మన్ జ్యోతుల బాబులు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఎన్నికల విధులు నిర్వర్తించండి

పెద్దాపురం: ఎన్నికల సిబ్బంది పూర్తి పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని పెద్దాపురం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ జేఎస్ రామారావు ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికల్లో అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాలకు చెందిన పోలింగ్, ఇతర అధికారులకు శుక్రవారం పోలింగ్ సరళి, ఈవీఎంల పనితీరుపై రెండు విడతలుగా శిక్షణ సదస్సులు నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సిబ్బంది ఎన్నికల విధులు నిర్వహించాలన్నారు. ఓటు వేసే విధానంపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈవీఎంలు ట్యాపరింగ్ గురవుతున్నాయన్న అపోహలు ప్రజల్లో తొలగిపోవాలంటే, వాటిపై అవగాహన పెంచాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. సిబ్బంది ఎన్నికల నిర్వహణపై పూర్తి స్థాయి శిక్షణ పొందాలని, సందేహాలుంటే నివృత్తిని చేసుకునేందుకు శిక్షణ తరగతులు దోహదపడతాయన్నారు. అనంతరం ఈవీఎంల పనితీరు, పోలింగ్ ప్రక్రియ ఏర్పాటు, పోలింగ్ అధికారుల విధులు, ఓటింగ్ కంపార్టుమెంట్, బ్యాలెట్ బాక్సుల ఆపరేటింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయ ఏఓ సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, పెద్దాపురం, సామర్లకోట తహసీల్దార్లు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ పద్మజ, భానుకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న ఆర్డీఓ రామారావు

ఓటింగ్‌కు ఏర్పాట్లు

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 4 తేదీ నుంచి హోం ఓటింగ్ ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పెద్దాపురం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ జేఎస్ రామారావు తెలిపారు. నియోజకవర్గంలో 155 మంది ఓటర్లు తమ ఇంటి వద్ద ఉండి ఓటు వేసే విధంగా నాలుగు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. 4, 5 తేదీల్లో ఆ ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న పీఓ, ఏపీఓ, ఓపీఓలతో పాటు ఆయా విభాగాల్లో విధులు నిర్వర్తించే సుమారు 880 మంది ఓటు హక్కు వినియోగించుకునేందుకు గాను స్థానిక లూథరన్ పాఠశాలలో బ్యాలెట్ ఓటింగ్ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. 4, 5, 6 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల లోపు ఆయా సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రణాళిక చేశామన్నారు.

బాబు కుట్రతో అవ్వాతాతలకు కష్టాలు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి దవులూరి దొరబాబు
- మళ్లీ జగన్‌తోనే ఇంటి వద్దకే పింఛన్లు



సామర్లకోట 20వ వార్డులో ఓ వృద్ధురాలితో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు

సామర్లకోట: చంద్రబాబు కుట్ర వల్లే పింఛన్లు పొందే అవ్వాతాతలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని, మళ్లీ జగనన్న సీఎం కాగానే ఇంటి వద్దకే పింఛన్లను అందిస్తారని వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గ అభ్యర్థి దవులూరి దొరబాబు అన్నారు. శుక్రవారం స్థానిక 20వ వార్డులో ఆ వార్డు కౌన్సిలర్ చిట్టుమాని రాఘవ, నాయకులు చిట్టుమాని శ్రీనివాసరావు, కర్నీడి జలంధర్, కేతా సాయి, గంగిరెడ్డి కృష్ణ మూర్తిల ఆధ్వర్యంలో దొరబాబు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అంతకు ముందు నీలమ్మచెరువు వద్ద ఉన్న సత్తెమ్మ తల్లి ఆలయంలో పూజలు చేశారు. పింఛన్ల సొమ్ము కోసం బ్యాంకుల వద్దకు వెళ్లలేకపోతున్నామని అవ్వా తాతలు దొరబాబు దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి ఆయన స్పందిస్తూ చంద్రబాబు అండ్ కో పింఛనుదారులు కష్టాలు ఎదుర్కొనే విధంగా చేశారన్నారు. వారు పింఛన్ల సొమ్ము బ్యాంకు ఖాతాల్లో జమచేసే విధంగా ఆదేశాలు ఇవ్వాలని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రతి నెలా తెల్లవారు జామునే వలంటీర్లు ఇంటింటికి వచ్చి పింఛన్లు ఇచ్చే వ్యవస్థను సీఎం జగన్ ఏర్పాటు చేస్తే, దానిని నిర్వీర్యం చేయాలని కూటమి నాయకులు చూస్తున్నారన్నారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగనన్నను గెలిపించుకుంటే ప్రజల వద్దకే అన్ని సదుపాయాలు అందుతాయని చెప్పారు. చంద్రబాబు ఏదో విధంగా అధికారంలోకి రావాలని ప్రజలను మభ్యపెట్టే విధంగా మేనిఫెస్టో తయారు చేశారని, ఓటర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. గత 14 ఏళ్లలో మూడు పర్యాయాలు ముఖ్యమంత్రిగా ఉండి ఏ ఒక్క సంక్షేమ పథకం చంద్రబాబు అమలు చేయలేదని తెలిపారు. హామీలే తప్ప చేసిందేమీ లేదని అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేసే జగనన్నను నమ్మాలని అన్నారు. సంక్షేమ పథకాల అమలులో అవినీతికి అవకాశం లేకుండా జగనన్న చేశారని దొరబాబు గుర్తుచేశారు. ఎన్నికల ప్రచారంలో దొరబాబుకు అపూర్వ స్వాగతం లభించింది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, పట్టణ పార్టీ అధ్యక్షుడు మద్దాలి శ్రీను, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పాగా సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సీబీదేవంలో మహిళకు ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న దొరబాబు



వేట్లపాలెంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న దవులూరి చంద్రకళ

వేట్లపాలెంలో దొరబాబు సతీమణి ప్రచారం

వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌లను గెలిపించుకోవడం ద్వారా సంక్షేమ పథకాలను కొనసాగించవచ్చని దొరబాబు సతీమణి చంద్రకళ అన్నారు. శుక్రవారం ఉదయం, సాయంత్రం ఆ పార్టీ గ్రామ నాయకులు గోలి బాబ్జి, వల్లూరి వీర్రాజుచౌదరి, ఎంపీటీసీ సభ్యురాలు బొబ్బరాడ లక్ష్మి, రాష్ట్ర అయ్యరక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, కౌన్సిలర్లు పాలిక కుసుమ, పెండ్యాల నాగ వెంకటలక్ష్మి, రెడ్డి లోవకుమారి, ట్రస్టు బోర్డు సభ్యురాలు కర్రి వెంకటలక్ష్మిలతో కలసి ఆమె ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దొరబాబును ఎమ్మెల్యేగా గెలిపించేందుకు ఫ్యాన్ గుర్తుపై ఓటెయ్యాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, గృహ సారథుల కన్వీనర్ ఇరుసుమళ్ల సాయి, ఎంపీటీసీ సభ్యురాలు పాలచర్ల వీరవెంకట నాగవేణి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నిడదవోలు సురేష్ చౌదరి, హుస్సేన్‌పురం ఉప సర్పంచ్ యవర్న చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే వీకే రాయపురంలో వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు చలమశెట్టి సునీల్, దవులూరి దొరబాబులకు మద్దతుగచ్చా పార్టీ జిల్లా కార్యదర్శి తలారి దొరబాబు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో పాదయాత్ర నిర్వహించడంతో పాటు ఇంటింటా తిరిగి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. విద్యాకమిటీ చైర్మన్ వెలమర్తి శ్రీనివాసు, నాయకులు ఇంటి వెంకట్రావు, వెలమర్తి బుల్లిరాజు, బదిరెడ్డి వీరప్రకాశరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీని గెలిపించండి

పెద్దాపురం: రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని చూసి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని ఆ పార్టీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు అన్నారు. చినబ్రహ్మదేవం, ఆర్‌బీపట్నం గ్రామాలతో పాటు పట్టణంలోని పలు వార్డుల్లో ఆయన ప్రచారం చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ నెక్కంటి సాయిప్రసాద్, నల్లల నాగేంద్రబాబు, పరిమి శ్రీను, ఎంపీపీ పెంకే సత్యవతి, ఎంపీటీసీ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ ప్రచారం జరిగింది. దొరబాబు మాట్లాడుతూ స్థానికుడిగా నియోజకవర్గ ప్రజలకు పరిచయస్తుడైన తనకు, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌కు ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, కంటే వీర్రాఘవరావు, జేసీఎస్ నియోజకవర్గ కన్వీనర్ గోపు మురళి, కనపర్తి బాబి, పెంటా విజయ్‌కుమార్, తుమ్మల అచ్యుతరామయ్య, సుందరెడ్డి రాజు, నాగబోయిన రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

వంగా గీత విజయం ఖాయం

సినీ నటి, యాంకర్ శ్యామల



పిఠాపురంలో మాట్లాడుతున్న నటి శ్యామల

పిఠాపురం: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత విజయం ఖాయమని, కేవలం మెజార్టీ కోసమే ప్రచారం చేస్తున్నామని సినీ నటి, యాంకర్ శ్యామల అన్నారు. ఆమె శుక్రవారం పిఠాపురం నియోజకవర్గంలో వంగా గీత తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వంగా గీతకు భారీ మెజార్టీ తీసుకు రావడానికే తాము ప్రయత్నిస్తున్నామన్నారు. ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి భారీ మెజార్టీ ఖాయమన్నారు. కేవలం ప్రజల కోసమే పని చేసే వైఎస్సార్ సీపీని గెలిపించుకోవాలని ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. ఈ పార్టీకి ఎటువంటి పార్టీలతో పొత్తులు అవసరం లేదన్నారు. కూటమి నేతల కుట్రలతో మండుటెండలో వృద్ధులు పింఛన్ల కోసం బ్యాంకుల చుట్టు తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్‌గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

వైఎస్సార్ సీపీతోనే పేదల అభ్యున్నతి

- ఆ పార్టీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత
- చేబ్రోలులో ఎన్నికల ప్రచారం

గొల్లప్రోలు: బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి వైఎస్సార్ సీపీతోనే సాధ్యమని ఆ పార్టీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత అన్నారు. మండలంలోని చేబ్రోలులో శుక్రవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. గత ఐదేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. మహిళలు ఆమెకు ఘన స్వాగతం పలుకుతుంటే ఆమె వారిని ఆప్యాయంగా పలకరిస్తూ వారితో మమేకమయ్యారు. ఈ సందర్భంగా వంగా గీత మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. గ్రామాల్లో ఆర్‌బీకేలు, సచివాలయ భవనాలు, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణంతో గ్రామాలకు రూ.కోట్ల విలువ చేసే స్థిరాస్తులు అందించారన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. డీబీటీ ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు జమ చేశామన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలే వైఎస్సార్ సీపీని గెలిపిస్తాయన్నారు. జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వులవకాయల నాగలోవరాజు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు అరిగెల రామయ్యదొర, కడిమిశెట్టి భాస్కర్‌రెడ్డి, చేబ్రోలు సర్పంచ్ దొండపాటి లోవతల్లి, పార్టీ నేత వుప్పాల బాబులు తదితరులు పాల్గొన్నారు.



చేబ్రోలులో ఎన్నికల ప్రచారం చేస్తున్న వంగా గీత